39 మంది కానిస్టేబుళ్లపై వేటు

- నిబంధనలు అతిక్రమించారని సస్పెన్షన్
- అర్ధరాత్రి టీజీఎస్పీ ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ఏక్ పోలీస్ నినాదంతో నిరసనలు తెలుపుతున్న బెటాలియన్ పోలీసులపై టీజీఎస్పీ కొరడా ఝుళిపించింది. నిబంధనలు అతిక్రమించారంటూ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు అర్ధరాత్రి టీజీఎస్పీ ఉత్తర్వులు విడుదల చేసింది. పోలీసు క్రమశిక్షణకు విరుద్ధంగా ఆందోళనలు చేపట్టడంతో పాటు ఇతరుల్ని ధర్నాలకు ఉసిగొల్పారనే ఆరోపణలతో 39 మందిని గుర్తించింది. పోలీసు ప్రవర్తనా నియమావళిని, క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే వీరిపై చర్యలు తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ రోడ్లపైకి రావడం సరికాదని తెలిపింది.

'బాపూఘాట్' అభివృద్ధికి భూసేకరణ!

'మెయిన్‌హార్ట్' ప్రతినిధులకు సూచించిన సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చుట్టూ భూసేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎంత మేర భూమి అవసరమో అంచనా వేసి చెప్పాలని మెయిన్‌హార్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులను సీఎం రేవంత్ ఆదేశించినట్టు సమాచారం. ఈ నెల 24వ తేదీన మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులతో తన నివాసంలో సీఎం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి కేవలం అధికారులు మాత్రమే హాజరుకాగా, మంత్రులు, ప్రజాప్రతినిధులెవరినీ ఆహ్వానించలేదని సమాచారం. ఈ చర్చల్లో ప్రధానంగా మూసీ బఫర్ జోన్, బాపూఘాట్‌పై చర్చ జరిగినట్టు తెలిసింది. మూసీ బఫర్ జోన్‌లో రోడ్లతో పాటు మెట్రో వంటి రవాణావ్యవస్థలతో అనుసంధానం చేసేలా డిజైన్లు రూపొందించాలని ఆదేశించినట్టు తెలిసింది. బాపూఘాట్‌ను ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించినట్టు సమాచారం. ఎంత మేర కేంద్రప్రభుత్వ భూములు కావాలో చెప్తే, ఆ మేరకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతామని కన్సల్టెన్సీ ప్రతినిధికి చెప్పారట. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌ను కలపాలని కాలువల ద్వారానా? లేదా టన్నెల్ ద్వారానా? అనేది కన్సల్టెన్సీ నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం.

మిల్లర్లు వర్సెస్ సర్కారు!

- ఇరువర్గాల మధ్య ఎడతెగని పంచాయితీ
- తీవ్రంగా నలిగిపోతున్న రైతులు
- ధాన్యం దించుకునేందుకు మిల్లర్ల ససేమిరా
- సమస్యలను పరిష్కరించాలని పట్టు
- మిల్లర్లను పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైస్ మిల్లర్స్, సర్కారు మధ్య పంచాయితీ తెగడం లేదు. సమస్యల పరిష్కారానికి మిల్లర్లు పట్టు పడుతుంటే.. ప్రభుత్వం మాత్రం ఆ అంశాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ మిల్లర్ల సమస్యల పరిష్కారంపై రేవంత్‌రెడ్డి సర్కారు ఫోకస్ చేయడం లేదు. దీనిపై మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ధాన్యం కొనుగోళ్లలో పాలుపంచుకోబోమని, ధాన్యాన్ని దించుకోబోమని తెగేసి చెప్తున్నారు. దీంతో ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య రైతులు నలిగిపోతున్నారు. కోతలు మొదలైనా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోతున్నది.

ఆ 2 డిమాండ్లపై గట్టిగా పట్టు

ప్రభుత్వం ముందు మిల్లర్లు అనేక డిమాండ్లను పెట్టినప్పటికీ ప్రధానంగా రెండు డిమాండ్ల పరిష్కారం కోసం గట్టిగా పట్టుపడుతున్నారు. మిల్లింగ్ చార్జీని పెంచడంతోపాటు సన్న ధాన్యం అవుట్ టర్న్ రేషియోను ఖరారు చేయాలని కోరుతున్నారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నది. కానీ, ఇక్కడే అసలు సమస్య ఏర్పడింది. మిల్లర్లు సన్న ధాన్యం తీసుకొని బియ్యం ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం 100 కేజీల ధాన్యానికి 67 కేజీల బియ్యం (సీఎమ్మార్) రావాలి. కానీ, సన్న ధాన్యంలో కేవలం 55-60 కేజీల బియ్యం మాత్రమే వస్తాయని మిల్లర్లు తెలిపారు. మిగిలిన నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే సన్న ధాన్యాన్ని దించుకోబోమని తేల్చి చెప్తున్నారు. ప్రభుత్వమే సన్న ధాన్యం సీఎమ్మార్‌పై టెస్ట్ మిల్లింగ్ చేయించాలని, ఇందులో వచ్చే ఫలితాల ఆధారంగా తాము సీఎమ్మార్ ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ 67 కేజీల బియ్యం ఇవ్వాల్సి వస్తే క్వింటాలుకు రూ.300 చొప్పున ప్రోత్సాహం లేదా పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనితోపాటు మిల్లింగ్ చార్జీలు పెంచాలని కోరుతున్నారు. క్వింటాల్ రా రైస్ మిల్లింగ్‌కు మధ్యప్రదేశ్‌లో రూ.200, ఛత్తీస్‌గఢ్‌లో రూ.120, ఏపీలో రూ.110 చెల్లిస్తుంటే తెలంగాణలో రూ.10 మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ రెండు సమస్యలను పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

పరిష్కారం చూపని మంత్రుల కమిటీ

మిల్లర్ల సమస్యలతో పాటు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై మొన్నటి వరకు పట్టింపు లేనట్టుగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం.. తీరా కొనుగోళ్ల ప్రారంభమయ్యే సమయానికి హడావిడి మొదలుపెట్టింది. అందులో భాగంగా ఈ నెల 8న నలుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. గోదాములను అద్దెకు తీసుకోవడం, రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ, మిల్లింగ్ చార్జీలు, ధాన్యం డ్రైయేజ్ సమస్యలకు పరిష్కారం చూపాలని ఈ కమిటీని ఆదేశించింది. వారం రోజుల క్రితం మిల్లర్లతో తొలిసారి భేటీ అయిన ఈ కమిటీ వారి సమస్యలపై చర్చ జరపకనే ఆ సమావేశం ముగించింది.

సర్కారు తీరుపై మిల్లర్ల గుస్సా

ప్రభుత్వ పెద్దలు, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుల తీరుపై మిల్లర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు తమపై కక్షగట్టిందని, మిల్లింగ్ పరిశ్రమను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా తమను దొంగలుగా చిత్రీకరిస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది చేసిన తప్పును మొత్తం ఇండస్ట్రీకి ఆపాదించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల తీరుతో మిల్లులను మూసేసే పరిస్థితి ఏర్పడిందని, దీంతో తన మిల్లులోని మెషినరీని అమ్మేసి మరో వ్యాపారం చేసుకునేందుకు సిద్ధమవుతున్నానని ఓ మిల్లర్ వాపోయారు.

అధికారుల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సన్న ధాన్యానికి అవుట్‌టర్న్ రేషియోను ఖరారు చేసేవరకు ధాన్యాన్ని దించుకోబోమని మిల్లర్లు తెగేసి చెప్పడంతో సివిల్ సప్లై అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో ఇంటర్మీడియట్ గోదాములను అద్దెకు తీసుకోవాలని, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆ గోదాముల్లో నిల్వ చేయాలని నిర్ణయించారు. ఎలా మిల్లింగ్ చేస్తారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు. అయినప్పటికీ అధికారుల ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మిల్లర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలానైనా అధికారులకు తమ బాధలు తెలుస్తాయని అంటున్నారు.

రైతుల ఇబ్బందులు

ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య కొనసాగుతున్న పంచాయితీలో రైతులు నలిగిపోతున్నారు. ఈ గొడవ ధాన్యం కొనుగోళ్లపై ప్రభావం చూపుతున్నది. మిల్లర్లు ముందుకు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అలస్యమవుతున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావాల్సి ఉండగా.. కేవలం నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల, మిగిలిన జిల్లాల్లో మండలానికి ఒకటి మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

కొలువు ఇవ్వాలని నేనంట.. మీరు కుదరదనాలె!

- తూతూ మంత్రంగా జీవో 46 బాధితులతో చర్చలు
- ఊరించి ఉసూరుమనిపించిన మంత్రి శ్రీధర్‌బాబు
- సమస్యలు వినే ఓపిక లేక ఈసడించుకున్న అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : జీవో 46 బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి 'మొండి చేయి' చూపించింది. బాధిత అభ్యర్థులు ఆందోళనలు చేయకుండా ప్రభుత్వ పెద్దలు వేసిన కొత్త ఎత్తుగడ ఫలించింది. 'ఉద్యోగాలు ఇద్దాం అని నేనంటా.. ఇవ్వడం కుదరదని నువ్ చెప్పు' అన్న చందంగా జీవో 46 బాధితుల ప్రతినిధులతో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం సాగినట్టు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే జీవో 46 బాధితులు ఇటీవల గాంధీ భవన్‌ను ముట్టడించిన సందర్భంగా అక్కడికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబును ఘెరావ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన శనివారం సచివాలయంలో సీఎస్, రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులతో మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే సచివాలయంలో శనివారం సమావేశం నిర్వహించగా.. జీవో 46 బాధితుల నుంచి సీనియర్ కౌన్సెలర్ జీ విద్యాసాగర్‌తో కలిపి ఐదుగురు ప్రతినిధులు హాజరయ్యారు. అధికార పక్షంగా మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, హోంశాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా, తెలంగాణ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాస రావు, వైస్ చైర్మన్, స్టాండింగ్ కౌన్సెల్ మెంబర్, కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, ముఖ్య కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితుల వేదన వినకపోగా వారిపైనే ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. వారు ఏం చెప్పినా తిరకాసు ప్రశ్నలతో 8 మంది అధికారులు ఐదుగురు బాధితులకు ఉక్కిరిబిక్కిరి చేశారు. శ్రీధర్‌బాబు కూడా ఏం చేసేది లేక అధికారుల వైపు మొగ్గు చూపారు. ఒకానొక దశలో బాధితులు చెప్పే వెర్షన్ వినే సహనం లేక అధికారులు సైతం ఈసడించుకున్నట్టు తెలిసింది.

లిస్టు తెప్పించుకొని చూద్దాంలే

ఈ సమావేశం ఎంతకూ ఒడవకపోవడంతో ఆఖరికి మంత్రి శ్రీధర్‌బాబు కలుగజేసుకొని 'ఈ జీవో 46 బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతమంది ఉంటారో తెలియదు కాబట్టి ముందుగా జిల్లాల వారీగా లిస్టు తెప్పించుకుంటాం. ఆ లిస్టు వచ్చిన తర్వాత మాట్లాడతాం' అని హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో తమ 16 నెలల పోరాటాన్ని కాంగ్రెస్ నేతలు నీరుగార్చారని బాధితులు వాపోయారు.

జాక్టో చైర్మన్‌గా సదానందంగౌడ్

సెక్రటరీ జనరల్‌గా కృష్ణుడు

సదానందంగౌడ్

కృష్ణుడు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) చైర్మన్‌గా జీ సదానందంగౌడ్(ఎస్టీయూ), సెక్రటరీ జనరల్‌గా కృష్ణుడు(బీసీటీఏ) ఎన్నికయ్యారు. శనివారం కాచిగూడలోని ఎస్టీయూభవన్‌లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో చైర్మన్లుగా ఎం రాధాకృష్ణ, డీ వెంకటేశ్వర్‌రావు, చైతన్య, జయబాబు, అంజయ్య అలీబాబా, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా విఠల్, నజీరుద్దీన్, నగేశ్, కోశాధికారిగా జీ హేమచంద్రుడు, ప్రచార కార్యదర్శిగా ఎండీ అబ్దుల్లా, గౌరవ సలహాదారులుగా ఎం పర్వత్‌రెడ్డి, ఎం చెన్నయ్య, వేణుగోపాలస్వామి, మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులు, డీఏలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవో బాధ్యతలు అప్పగించాలని, మాడల్ స్కూల్ టీచర్లు 010 పద్దు కింద వేతనాలు చెల్లించి, పదోన్నతులు కల్పించాలని, అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దుచేయాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్కిల్స్ వర్సిటీకి మేఘా 200 కోట్ల విరాళం

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల సమక్షంలో ఎంవోయూ అందజేస్తున్న మేఘా ఎండీ కృష్ణారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మేఘా కంపెనీ రూ.200 కోట్ల విరాళాన్ని అందజేసింది. శనివారం సీఎం సమక్షంలో వీసీ సుబ్బారావుకు చెక్కను ఇచ్చింది. ఈ నిధులతో భవన నిర్మాణం, మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇందులో సహకారమందించేందుకు మేఘా ఎండీ కృష్ణారెడ్డి ఎంవోయూ చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలో 64 రాళ్ల తొలగింపు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాలకు చెందిన రమేశ్ యేడాది నుంచి కిడ్నీ స్టోన్స్‌తో బాధపడుతున్నాడు. నొప్పి ఎక్కువ కావడంతో గత బుధవారం రిమ్స్‌లో చేరాడు. శనివారం మధ్యాహ్నం యూరాలజీ ప్రత్యేక వైద్య నిపుణుడు డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి 64 రాళ్లను తొలగించారు. -ఎదులాపురం

గురుకులంలో మళ్లీ ఖాళీలు!

- ఇప్పటికే 2500పైగా బ్యాక్‌లాగ్‌లు
- డీఎస్సీ, జేఎల్ ఫలితాలతో మరిన్ని..
- సొసైటీల టైం టేబుల్, సర్వీస్ రూల్సే కారణం

హైదరాబాద్, అక్టోబర్26 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో ఇటీవల భర్తీ చేసిన పోస్టుల్లో ఇప్పటికే భారీగా బ్యాక్‌లాగ్ ఏర్పడగా, తాజాగా డీఎస్సీ ఫలితాలతో మరిన్ని పోస్టులు ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం గురుకులాల పనివేళలు, పేరుకే ప్రభుత్వ ఉద్యోగి తప్ప ఇతర సర్వీస్ సబార్డినేట్ రూల్స్ ఏవీ వర్తించకపోవడమేనని సొసైటీ ఉద్యోగులు తెలుపుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీకి ట్రిబ్ గతేడాది ఆగస్టులోనే రాత పరీక్షను నిర్వహించింది. కోర్టు కేసుల నేపథ్యంలో మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులను మినహాయించి మిగతా పోస్టుల భర్తీని చేపట్టింది. 8,708 పోస్టులకు 1:2 ఎంపిక చేసింది. కొన్ని కేటగిరీల్లో అర్హులు లేరని 404పోస్టులను భర్తీ చేయలేదు. మొత్తంగా 8,304 పోస్టులకు తుది జాబితాలను ప్రకటించి ఆర్డర్లు ఇచ్చింది. వారిలో దాదాపు 2వేల మంది అభ్యర్థులు ఇప్పటికీ జాయిన్ కాలేదని తెలుస్తున్నది. ఆయా అభ్యర్థులు జాయిన్ కావడానికి మరో నెల రోజుల పాటు గడువు ఉన్నా, ఇప్పటికే వరకు మొత్తంగా 2500 పోస్టులు ఖాళీగా మిగిలిపోవడం గమనార్హం.

డీఎస్సీతో మరో వెయ్యి..!

గురుకుల పోస్టులకు రాత పరీక్ష రాసిన చాలా మంది అభ్యర్థులు డీఎస్సీ రాతపరీక్షకు కూడా హాజరయ్యారు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఇటీవల ఆయా సొసైటీల నుంచి ఎన్‌వోసీ (నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్) కోసం భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఎన్‌వోసీలకు దరఖాస్తు పెట్టుకున్న అభ్యర్థులు అన్ని సొసైటీల్లో కలిపి 1000 మందికిపైగా అభ్యర్థులు ఉన్నారు. ఆ మేరకు పోస్టులు గురుకులాల్లో మళ్లీ ఖాళీ అయ్యే దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే గతంలోనే టీజీపీఎస్సీ నిర్వహించిన 1,302 జేఎల్ పోస్టుల రాత పరీక్షలకు సంబంధించి ఇటీవలనే 1:2 జాబితాలను ప్రకటించగా, గురుకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులే చాలా మంది అభ్యర్థులు జేఎల్ పోస్టులనూ సాధించారు. దీంతో గురుకులాల్లో నియామకమైన పోస్టుల్లో ఎక్కువ పోస్టులు ఖాళీ అయ్యే అవకాశమే ఉన్నది. గురుకులాల్లో పోస్టింగ్ సాధించిన అభ్యర్థులు ఆ తరువాత అనేక మంది వదులుకుంటున్నా రు. అందుకు ప్రధాన కారణం గురుకులాల్లో ని పనివేళలు, ఇతర సర్వీస్ రూల్సే కారణమ ని పలువురు అధ్యాపకులు వెల్లడిస్తున్నారు.

డిగ్రీలో 2.61 లక్షల సీట్లు ఖాళీ

భర్తీ అయ్యింది 42 శాతమే • ముగిసిన ఫస్టియర్ అడ్మిషన్లు

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ) : 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఫస్టియర్‌లో మొత్తం 4,57,704 సీట్లుండగా.. 1,96,442 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మొత్తం సీట్లల్లో కేవలం 42 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. దోస్త్ ద్వారా తొలుత మూడు విడుతల్లో సీట్లను భర్తీచేశారు. ఆ తర్వాత పలు విడుతల్లో సీట్ల భర్తీకి అవకాశానిచ్చారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత సైతం ప్రవేశాలకు అవకాశం కల్పించారు. అయినా 2 లక్షల్లోపే అడ్మిషన్లు నమోదయ్యాయి.

ప్రైవేట్‌లో 38 శాతమే..

రాష్ట్రంలో 816 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలుండగా, వీటిలో 3,44,793 సీట్లకు 38.39 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. గురుకుల డిగ్రీ కాలేజీల్లోని సీట్లకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉంటున్నది. యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 89 వేల సీట్లలో 61 శాతం సీట్లు భర్తీ కావడం గమనార్హం. డిగ్రీ ఫస్టియర్‌లో 4.57 లక్షల సీట్లుండగా ఇంటర్ పాసైన వారు తక్కువగా ఉండడంతోపాటు ఇంజినీరింగ్, నీట్‌లో ఎక్కువగా చేరుతుండడంతో సీట్లు అధికంగా మిగులుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది డిగ్రీ ఫస్టియర్‌లో 1,96,442 విద్యార్థులు ప్రవేశాలు పొందితే వీరిలో 1,05,329 విద్యార్థులు మహిళలే ఉన్నారు.

కోర్సుల వారీగా ప్రవేశాలు

కోర్సు	అడ్మిషన్లు
బీఏ	28,362
బీబీఏ	15,835
బీసీఏ	5,170
బీకాం	77,469
బీఎస్సీ లైఫ్ సైన్సెస్	36,733
బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్	32,181
ఇతర కోర్సులు	692

ఫస్టియర్‌లో అడ్మిషన్ల వివరాలు

యాజమాన్యం	కాలేజీలు	మొత్తం సీట్లు	చేరినవారు
ప్రభుత్వ కాలేజీలు	160	89,337	55,361
ప్రైవేట్ కాలేజీలు	816	3,44,793	1,32,388
రెసిడెన్షియల్ కాలేజీలు	79	23,574	8,693
మొత్తం	1,055	4,57,704	1,96,442

దీపావళి కానుక.. ఉద్యోగులకు ఒక డీఏ!

- 317 జీవోలో స్పౌజ్, హెల్త్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు
- నవంబర్ మొదటి వారంలో కులగణన సర్వే
- గిరిజన యూనివర్సిటీకి 211 ఎకరాల స్థలం
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీకి గచ్చిబౌలి స్టేడియం
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు
- రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు

మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు దీపావళి కానుకగా ఒక్క డీఏ ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. నవంబర్ మొదటివారంలో సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే ప్రారంభించి, నెలాఖరులోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో మంత్రి మండలి సమావేశమైంది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు.

- మొదటి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు. దీపావళి తర్వాత ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి కుల, మతాలకతీతంగా అతి పేదలకు ఇండ్ల కేటాయింపు.
- జీవో 317పై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా హెల్త్, స్పౌజ్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు వెంటనే చేయాలని నిర్ణయం. 317లోని ఇతర అంశాలపై, జీవో 46పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, క్లియరెన్స్ కోసం కేంద్రానికి పంపాలని నిర్ణయం.
- నవంబర్ 31లోపు సామాజిక, ఆర్థిక, కుల సర్వే పూర్తి చేయాలని నిర్ణయం.
- రాష్ట్రవ్యాప్తంగా 6 వేలకుపైగా ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు. రైస్ మిల్లర్ల వద్ద గతంలో ఇచ్చిన రూ.20 వేల కోట్ల ధాన్యం మిగిలిపోగా మిల్లర్లలో క్లీన్ చిట్ ఉన్నవారిని ఒక క్యాటగిరీ, నోటీసులు ఇచ్చిన తర్వాత డబ్బులు కట్టినవారిని రెండో క్యాటగిరీ, వాళ్లు కట్టకపోతే ప్రభుత్వమే రికవరీ చేసిన వారిని మూడో క్యాటగిరీలో ఉంచి, డిఫాల్టర్లను ఎలిమినేట్ చేయాలని నిర్ణయం. ఈ సీజన్‌లో ప్రభుత్వం సేకరించే ధాన్యానికి సంబంధించి క్యాటగిరీలను బట్టి బ్యాంకు గ్యారెంటీలు తీసుకోవాలని నిర్ణయం.

హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశకు సంబంధించి నాగోల్-శంషాబాద్, రాయదుర్గం-కోకాపేట, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్బీనగర్-హయత్ నగర్ మార్గాల్లో 76.4 కిలోమీటర్ల మేర కొత్త మెట్రోరైలు ఏర్పాటుకు రూ.24,269 కోట్లకు డీపీఆర్ సిద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టు చేపట్టేందుకు డీపీఆర్‌ను కేంద్రానికి పంపాలని నిర్ణయం.

- పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో సుమారు 16-17 వేల కిలోమీటర్ల రహదారులు నిర్మించాల్సి ఉన్నది. ఇందుకు రూ.25-28వేల కోట్లు అవసరమని అంచనా. పాత జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని నాలుగేండ్లలో పీపీపీ పద్ధతిలో ఈ రోడ్లు నిర్మించాలని నిర్ణయం. ఈ మేరకు డీపీఆర్ తయారు చేసేందుకు అన్ని శాఖల ఇంజినీరింగ్ శాఖల ముఖ్య అధికారులతో కమిటీ.
- గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌ను ఉస్మానియా దవాఖాన నిర్మాణానికి బదిలీ చేసేందుకు ఆమోదం.
- ములుగు గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల స్థలం కేటాయింపు.
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ కోసం గచ్చిబౌలి స్టేడియం వాడాలని నిర్ణయం.
- స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా మదిర, వికారాబాద్, హుజూర్‌నగర్‌లో ఐటీఐలు ఏర్పాటు.
- రాష్ట్రంలో కొత్తగా 8 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోర్టులకు, మరో రెండు కాలేజీలకు స్టాఫ్ మంజూరు.
- రిజర్వాయర్లలో సిల్ట్ తొలగింపునకు కడెం ప్రాజెక్టు ఎంపిక.

4 నుంచి కులగణన : మంత్రి పొన్నం

సమగ్ర కుల గణన సర్వేకు సంబంధించిన విధివిధానాలను క్యాబినెట్ ఆమోదించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. నవంబర్ 30లోపు సర్వే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సోమవారం కలెక్టర్లతో సదస్సు నిర్వహిస్తామని, జిల్లా, మండల అధికారులకు శిక్షణ ఇస్తామని వివరించారు. నవంబర్ 4 లేదా 5 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. సమాచార సేకరణకు సంబంధించి ప్రతి 150 ఇండ్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొత్తం 20 రోజుల్లోపు ప్రక్రియ పూర్తిచేస్తామని, ఈ వివరాలతో నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉద్యోగులకు దీపావళి కానుకగా డీఏ ఇస్తున్నామని, ఖజానాపై నెలకు రూ.230 కోట్ల భారం పడుతుందని తెలిపారు.

ప్రభుత్వ తీరు అవమానకరం

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు న్యాయ సమ్మతంగా రావాల్సిన డీఏల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉన్నదని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదన్నారు. ఉద్యోగులకు ఐదు డీఏలు రావాల్సి ఉంటే, ఒక్కటే మంజూరు చేయడం అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రభుత్వం మాట మార్చింది

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, ఇప్పుడు తప్పడం సమంజసం కాదని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదనాయక్ విమర్శించారు. ఐదు డీఏలు కలిపి 17.28 శాతం రావాల్సి ఉన్నదన్నారు. ఇందులో ఒక డీఏ మాత్రమే ప్రకటించడం అన్యాయమన్నారు. 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ కూడా ప్రకటించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా జీవో 317ను రద్దు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

టీచర్ పోస్టుల తరలింపు

- ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు..
- 870 పోస్టులున్నట్టు అంచనా

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లలోని పోస్టులను మరో స్కూల్‌కు తరలించేందుకు విద్యాశాఖ అనుమతిచ్చింది. ఇలా 870 పోస్టులను తరలించనున్నారు. వీటిలో ఎక్కువగా భాషా పండితులు, ఎస్జీటీ పోస్టులున్నట్టు తెలిసింది. ఇది వరకు మిగులు టీచర్లను సర్దుబాటు చేసేవారు. కానీ ఇప్పుడు ఏకంగా పోస్టులనే మరో స్కూల్‌కు తరలించారు. ఇటీవలీ ప్రైమరీ స్కూళ్లను అప్పర్ ప్రైమరీ స్కూళ్లుగా, అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్‌చేశారు. కొన్ని స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య పెరగగా, మరికొన్ని స్కూళ్లల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది. అయితే గతంలో పోస్టులను అలాగే ఉంచి టీచర్లను మాత్రమే తాత్కాలికంగా సర్దుబాటు చేసేవారు. కానీ ఇప్పుడు పోస్టులనే తరలించేందుకు అనుమతిచ్చారు.

టీజీటీఎస్‌లో భారీగా ఉద్యోగాల కోత!

- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల కక్షపూరిత వైఖరి
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు
- వాళ్లను తీసేయండి.. మా వాళ్లను పెట్టుకుంటా!
- వివాదాస్పదంగా టీజీటీఎస్ చైర్మన్ మన్నె సతీశ్ వ్యవహారం

'అంతా నా ఇష్టం.. నేను చెప్పినట్టే నడుచుకోవాలి.. లేదంటే ఉద్యోగం ఊస్టే..నా మాట వినని వారిని తీసేయండి.. మా వాళ్లను పెట్టుకుంటా..'అని టీజీటీఎస్ చైర్మన్ వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తెలంగాణకు చెందిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై కక్షపూరిత ధోరణి అవలంబిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ప్రభుత్వరంగ సంస్థలకు చైర్మన్లుగా నియామకమైన నాయకుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాము చెప్పినట్టే నడుచుకోవాలని హుకూం జారీ చేస్తున్నట్టు సమాచారం. అందుకు నిదర్శనమే టీజీటీఎస్ లిమిటెడ్‌లో నెలకొన్న పరిస్థితులు. తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్(టీజీటీఎస్)లో అంతా నా ఇష్టం అన్నట్టుగా చైర్మన్ మన్నె సతీశ్ చౌదరి వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తాను చెప్పినట్టే టెండర్ల ప్రక్రియ జరగాలని అధికారులనూ బెదిరిస్తున్న పరిస్థితి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల కక్షపూరిత వైఖరి అవలంబిస్తున్నారని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు వాపోతున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన కొంత మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను తయారు చేసి, వారిపై ఇతర కారణాలను చూపి వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. తొలగించబోయే ఉద్యోగుల స్థానంలో తన వర్గానికి చెందిన వాళ్లు, బంధువులను ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఉద్యోగులను నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఆంధ్రా ప్రాంతానికి చెందిన సతీశ్ చౌదరి తెలంగాణ ఐటీ శాఖలోని కీలకమైన టీజీటీఎస్‌లో అనైతిక చర్యలకు పాల్పడుతున్నాడని ఉద్యోగులు వాపోతున్నారు. చైర్మన్ తీరుతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు ఈ విషయాన్ని తెలంగాణ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ వైస్ చైర్మన్ దేవీప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు.

నేను బాబుగారి బంధువును..

ఐటీ శాఖలో కీలకమైన కార్పొరేషన్ తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ లిమిటెడ్. ఆ సంస్థ చైర్మన్ పదవి ఆంధ్రా ప్రాంతానికి చెందిన మన్నె సతీశ్ చౌదరికి ఎలా వచ్చిందన్న దానిపై పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. 'తాను బాబు గారి బంధువునని, ఆయన రికమండేషన్‌తోనే చైర్మన్ అయ్యాను..' అంటూ హంగామా చేయడంపై పలువురు మండిపడుతున్నారు. నామినేటెడ్ పదవిని ఎంతో బాధ్యతతో నిర్వహించాల్సిన చైర్మన్ కక్షపూరితంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

టీజీఎండీసీ విస్తరణ దిశగా అడుగులు

- త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదన

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఇసుకతోపాటు ఇతర మినరల్స్ తవ్వకాలనూ చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. రాష్ట్రంలో ఇసుకతోపాటు సున్నపురాయి, గ్రానైట్, రెడ్ మెటల్, మాంగనీసు, డోలమైట్, లేటరైట్, మార్బుల్, కాల్సైట్, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, మైకా తదితర ఖనిజాల నిల్వలు అపారంగా ఉన్నాయి. ప్రస్తుతం టీజీఎండీసీ కేవలం ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండగా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తున్నది. ఆయా ఖనిజాలకు అనుమతులు పొందుతున్న కాంట్రాక్టర్లు ఇష్టారీతిన తవ్వకాలు జరుపుతూ ఖజానాకు గండి కొడుతున్నట్టు గుర్తించారు. దీంతో ఇసుక మాదిరిగానే మిగిలిన ఖనిజాలనూ తమ ఆధ్వర్యంలోనే చేపటేలా పావులు కదుపుతున్నది.